క్లుప్తంగా

నగర పాలక సంస్థ సిటీ ప్లానర్‌గా మీనాకుమారి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్‌గా వి.మీనాకుమారి నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై. లక్ష్మీ జీఓ 526 జారీ చేశారు. విశాఖపట్నం మహా నగర పాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆమెకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. దీంతో అక్కడి నుంచి కర్నూలు నగర పాలక సిటీ ప్లానర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి 8 వ తేదీ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిగా డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ పనిచేస్తున్నారు.

వైద్యరంగంలో ఫార్మసీ కీలకం

కర్నూలు సిటీ: వైద్యరంగంలో ఫార్మసీ విభాగం కీలకమైనదని జేఎన్‌టీయూ (హైదరాబాద్) సుల్తాన్‌పూర్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సునీతా రెడ్డి, సీఎస్ఐఆర్ సైంటిస్ట్ డా.ఎస్ రామకృష్ణ అన్నారు. మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో జేఎన్‌టీయూ(అనంతపురం) ఆధ్వర్యంలో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. ఇన్‌సైట్ ఇన్‌టూ ఎక్స్‌పర్‌మెంటల్ అండ్ క్లినికల్ ఎడ్యుకేషన్ ఇన్ ఫార్మసీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫార్మసీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మైపర్ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సురేష్, వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కాపాడేందుకు ఆశాలు కృషి చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆశాలు కృషి చేయాలని ప్రభుత్వ సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆచార్య చరక జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫిమేల్)లో ఆశాలకు, స్టాఫ్ టీటీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల నివారణ, మన ఆరోగ్యం–గృహవైద్యం, జీవనశైలి వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌టీ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.అంజనీ భూషణ్, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్. ప్రతిభ, మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్. సరళ గంగ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. స్వర్ణగౌరి పాల్గొన్నారు.

వృద్ధాప్యం శాపం కాకూడదు


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి. శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): మనిషి జీవితంలో వృద్ధాప్యం శాపం కాకూడదని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. కర్నూలు నగర శివారులోని సెరూడ్స్ వృద్ధాశ్రమంలో సోమవారం జాతీయ వృద్ధాప్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను పెంచుతారని, అయితే వారు వృద్ధాప్యంలో చేరినప్పుడు పిల్లలు నిర్లక్ష్యం చేయకుండా వారిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జ్ఞానేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

శుభకార్యం


నూతన వధూవరులతో మంత్రి బుగ్గన, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాలులో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ చెల్లెలు కుమారుడు రమేష్, తమ్ముడి కూతూరు మాధవిల వివాహం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితోపాటు వివాహ వేడుకలకు కర్నూలు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం ఎంపీలు డాక్టర్ సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, తలారి రంగయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.


హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు


పెద్ద పడఖాన వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు


5 వ వార్డులో చేపడుతున్న సీసీ కల్వర్టు పనులు

పాతబస్తీలో అభివృద్ధి పరుగులు

- మారుతున్న ఓల్డ్‌సిటీ రూపురేఖలు
- 15 ఏళ్లనాటి పెండింగ్ సమస్యలకు చెక్
- రూ.4.18 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- చురుగ్గా సాగుతున్న డ్రైనేజీ, కల్వర్టు, అప్రోచ్, సీసీ రోడ్ల పనులు

ఇరుకు సందులు, దెబ్బతిన్న రోడ్లు, నిత్యం ట్రాఫిక్ జాం, వేలాడుతున్న విద్యుత్ తీగలు, పురాతన కాలం నాటి డ్రైనేజీలు, కల్వర్టులు, వాటిలోనే మంచినీటి పైపులు పాతబస్తీ అనగానే గుర్తుకొచ్చే సమస్యలు. ఎన్నో ఏళ్ల నుంచి నెలకొన్న ఈ సమస్యల పరిష్కారానికి వైఎస్ఆర్‌సీపీ సర్కారు చర్యలు చేపట్టింది. కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పరుగులు పెట్టిస్తుంది. దీంతో పాతబస్తీ సరికొత్త రూపు సంతరించుకుంటోంది.

కర్నూలు (టౌన్): 1 వ వార్డు నుంచి 18 వార్డుల వరకు విస్తరించిన పాతబస్తీ ప్రాంతంలో 2 లక్షలకు పైగా జనాభా ఉంది. ఈ ప్రాంతంలో అత్యధికంగా పేదలు నివసిస్తున్నారు. అయితే, వారి నివాస ప్రాంతాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం ఈ పాతబస్తీని పట్టించుకున్న పాపాన పోలేదు. కార్పొరేషన్‌కు 10 ఏళ్లకు పైగా ఎన్నికలు నిర్వహించకపోవడం, కార్పొరేటర్లు లేకపోవడంతో పాలన పూర్తిగా కుంటుపడింది. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించడంతో పాటు నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పాతబస్తీలో పర్యటిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల రహదారులను విస్తరించారు. మరికొన్ని చోట్ల అందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్లు, మురుగుకాల్వలు, డ్రైనేజీ నిర్మాణాలు, ఖబరస్థాన్‌ల అభివృద్ధి తదితర పనులు చేపట్టారు.

రూ.4.18 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

పాతబస్తీలోని అన్ని ఏరియాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నగరపాలక ఇంజినీరింగ్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. గడప గడప కార్యక్రమానికి స్వయాన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వెళుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలతో పాటు సమస్యలు తెలుసుకుంటున్నారు. గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ. 2 కోట్లు ప్రకారం రెండు విడతలుగా రూ.4 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పాతబస్తీలో మౌలిక సదుపాయాల కల్పన పనులు ఊపందుకున్నాయి. పాతబస్తీలోని బండ్ రోడ్డు నుంచి గంగమ్మ దేవాలయం మీదుగా రాంబోట్ల దేవాలయం వరకు ఇబ్బందిగా ఉండేది. ముళ్లకంపలతో ఇబ్బందికరంగా ఉన్న ఈ రహదారిని అప్రోజ్ రోడ్డుగా తీర్చిదిద్దారు. అలాగే చిన్నపాటి సందులను వెడల్పు చేశారు. జమ్మిచెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు.కింగ్ మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కును తీర్చి దిద్దారు. ఛత్రీబాగ్, పెద్దపడఖాన, నరసింగరావు పేట, బడీబీత్, ఖందేరి ఖల్లా, ఉస్మానియా కళాశాల, వడ్డగేరి, చిత్తారి వీధి వంటి అనేక కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించారు.

రూ. 50 లక్షలతో క్రీడా ప్రాంగణం

పాతబస్తీలో కాలనీలు ఎక్కువ. వ్యాపార సముదాయం ఎక్కువే. అయితే, ఇక్కడ ఆహ్లాదం పంచే స్థలాలు లేవు. పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలాలు లేవు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ 6 వ వార్డులో ముస్లింల బరియల్ గ్రౌండ్ పక్కనే ఉన్న మునిసిపల్ ఖాళీ స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. రూ. 50 లక్షలు వెచ్చించి ఖాళీ స్థలాన్ని చదును చేసి చుట్టు ప్రహరీ గోడ నిర్మించేందుకు నగరపాలక అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

పాతబస్తీలో గడప గడప నిధులు రూ. 4 కోట్లతో పాటు నగరపాలక కౌన్సిల్ తీర్మానంతో జరుగుతున్న మరికొన్ని అభివృద్ధి పనులు వార్డుల వారీగా ఇలా..

వార్డు	నిధులు (రూ.లక్షల్లో)	పనులు
2	55	మురుగు కాల్వలు (ఖల్లా వీధి)
3	53	సీసీ రోడ్లు, డ్రైన్లు
6	85	మురుగు కాల్వలు, ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి
7	20	డ్రైనేజీలు
10	20	కల్వర్టుల నిర్మాణం
13	50	కమ్యూనిటీ హాలు
14	20	మురుగు కాల్వలు
15	60	సీసీ రోడ్లు (బుధవారపేట), డ్రైనేజీలు
16	40	మురుగు కాల్వలు
17	30	సీసీ డ్రైన్లు, రోడ్లు
18	40	రహదారులు

యుద్ధ ప్రాతిపదికన పనులు



గతంలో ఎన్నడూ లేని విధంగా పాతబస్తీలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచనల మేరకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాము. ఇరుకు సందులను వెడల్పు చేసి సీసీ రోడ్లు వేస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేసి క్రీడా స్థలంగా తీర్చిదిద్దుతున్నాం. హిందూ, ముస్లింల శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు చేస్తున్నాం.
– షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

రాష్ట్రంలో జనరంజక పాలన

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. భగత్ సింగ్ నగర్, కప్పల్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, సమీపంలోని వార్డు సచివాలయానికి వెళ్తే సరిపోతుందని చెప్పారు. గతంలో జిల్లా అధికారులు, మండల కార్యాలయాల చుట్టు తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. అవసరమైన ప్రతి సేవను స్థానిక సచివాలయంలోనే పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, షేక్, ఇర్ఫాన్, సాధిక్, జోషిరాజ్, చందు పాల్గొన్నారు.

టార్పాలిన్లు అమ్మేయడంలో ముగ్గురిదే బాధ్యత


- యార్డ్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డికి క్లీన్‌చీట్
- ముగ్గురి నుంచి రూ.1.80 లక్షల రికవరీకి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో టార్పాలిన్లను అక్రమంగా అమ్మేసిన సంఘటనకు అసిస్టెంటు మార్కెట్ సూపర్‌వైజర్(ఏఎంఎస్) నరసయ్య, మార్కెట్ యార్డులో పనిచేసే కృపాకర్, మధు, రాజులను బాధ్యులను చేశారు. పర్యవేక్షణ లోపం కారణంగా ఏఎంఎస్‌ను బాధ్యుడిని చేసి క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం చేశారు. మొదట 45 టార్పాలిన్‌లు అమ్మేసినట్లుగా భావించారు. గుట్టుచప్పుడు కాకుండా అమ్మేసిన టార్పాలిన్ల సంఖ్య 72కు పెరిగింది. టార్పాలిన్ల అమ్మేయడంలో సూత్రదారి యార్డ్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి అనే ప్రచారం జరిగింది. యార్డ్ అసిస్టెంట్లను ఈయన పర్యవేక్షిస్తుంటారు. మార్కెట్ యార్డు సెక్రటరీ నిర్వహించిన ప్రాథమిక విచారణలో మధుసూదన్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు స్పష్టం కావడంతో తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. అయితే, సోమవారం సాయంత్రం మరోసారి విచారణ జరిపి మధుసూదన్‌రెడ్డికి క్లీన్‌చీట్ ఇచ్చారు. అసిస్టెంటు మార్కెట్ సూపర్‌వైజర్ నరసయ్య నిర్లక్ష్యం కారణంగానే టార్పాలిన్లను అమ్ముకునే అవకాశం లభించిందని నిర్ధారణకు వచ్చారు. 72 టార్పాలిన్లను తామే బయటికి తరలించి అమ్ముకున్నామని డైలీ వేజ్ ట్రాక్టర్ డ్రైవర్ కృపాకర్, అవుట్ సోర్సింగ్ వాచ్‌మెన్ మధు, స్వీపర్ రాజు అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. వీరి నుంచి ఒక్కో టార్పాలిన్ ధర రూ.2500 ప్రకారం రూ.1.80 లక్షలు వారం.. 10 రోజుల్లో రికవరీ చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఏఎంఎస్ నరసయ్య సస్పెన్షన్ కోసం మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు సిఫారసు చేయగా... మిగిలిన ముగ్గురిపై చర్యలు తీసుకోనున్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్) : పేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని స్థానిక 10 వ వార్డు మాసుంబాషా దర్గా వద్ద స్థానిక కార్పొరేటర్ యూనస్‌బాషా తండ్రి మాజీ కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సలాం రెండవ వర్ధంతిని పురస్కరించుకొని ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మేయర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్గొన్నారు.

'ప్రేమ దేశపు యువరాణి' చిత్రం ప్రీ రిలీజ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: 'ప్రేమ దేశపు యువరాణి' చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ సోమవారం కర్నూలు నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. నిర్మాతలు వేమూరి ఆనంద్, నాగవేణి రెడ్డి నిర్మాణంలో సాయి సునీల్ దర్శకత్వంలో యామిన్ రాజు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈవెంట్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయకుమారి మాట్లాడుతూ ఇది వినూత్నమైన ప్రేమ కథా చిత్రం అన్నారు. తెలుగు రాష్ట్ర ప్రజలు ఆదరించేలా చిత్రం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిత్రం యూనిట్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రాలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

కర్నూలు (టౌన్) : పాతబస్తీలోని జమ్మిచెట్టు ప్రాంతంలో హిందూ శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైందని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు హరీష్‌బాబు నగరపాలక అధికారులను కోరారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొని వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

అథ్లెటిక్స్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు(టౌన్): అథ్లెటిక్స్ క్రీడాంశంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బత్తిన బిల్డర్స్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు అథ్లెటిక్స్ వంటి క్రీడాంశంలో సాంకేతిక పరమైన సలహాలు తీసుకొని సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించగలుగుతారన్నారు. క్రీడల్లో రాణించాలంటే ఫిట్‌నెస్ ప్రధానమని, విద్యార్థులు చదువుతో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు, సంఘం ప్రతినిధులు నాగరత్నమయ్య, గంగాధర్, చిట్టిబాబు, లోకేష్ పాల్గొన్నారు.

24 న అంతర్ పాఠశాలల తైక్వాండో పోటీలు

కర్నూలు (టౌన్) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాల బాలికల విభాగంలో తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి. రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు సెల్ నెంబర్ 9849971256కు సంప్రదించాలని సూచించారు.

విన్నపం

దినసరి కూలీలను ఆప్కాస్‌లో చేర్చండి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ గిరిజన వసతి గృహాల్లో దినసరి కూలీలుగా పనిచేస్తున్న కుక్, కామాటీ, వచ్‌మెన్లను ఆప్కాస్‌లో చేర్చాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప కోరారు. సోమవారం ఇక్కడకు వచ్చిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని దినసరి కూలీలతో కలిసి వినతి పత్రం అందించారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో గరుడ పంచమి

కర్నూలు కల్చరల్: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో కద్రువ, వినత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ పంచమి నేపథ్యంలో గరుడ నోములు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

కర్నూలు కల్చరల్ : స్థానిక సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ శంకర స్వామి వారికి రుద్రాభిషేకాలు, లఘున్యాస పూర్వక అలంకారం, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సమాచారం

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ సెమిస్టర్ పరీక్షకు 1958 మంది విద్యార్థులకు గాను 1,739 మంది హాజరయ్యారని తెలిపారు. సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ (కర్నూలు), ఏఎస్ డిగ్రీ కళాశాల (తుగ్గలి)లో ఒక్కొక్కరి చొప్పున విద్యార్థులు డిబారయ్యారని వీసీ వెల్లడించారు.

వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజిలో వైద్య విద్యార్థులు తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు యాంటి ర్యాగింగ్ కమిటీ చైర్మన్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. సోమవారం కళాశాలలోని కౌన్సిల్ హాలులో హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. యాంటి ర్యాగింగ్ కమిటీ, కొత్త అండర్ గ్రాడ్యుయేట్ కోసం అమలులో ఉన్న నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు. ఈ మేరకు అవసరమైన చర్యలను ఆయా విభాగాల హెచ్‌ఓడీలు అమలు చేయాలని సూచించారు. ఇకపై ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్‌కు, జీతం అటాచ్‌మెంట్ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణ సమయంలో కళాశాల, ఆసుపత్రిలోనే ఉండాలని, రోజుకు మూడు సార్లు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలని చెప్పారు. వైద్య కళాశాల విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు పట్టిక, వైద్య కళాశాల అధ్యాపకుల రిజిస్టర్ పటిష్టంగా అమలు చేయాలన్నారు. కళాశాలలో త్వరలో కల్చరల్, స్పోర్ట్స్ డే నిర్వహిస్తామన్నారు. కొత్త పీజీ సీట్లు ఇటీవల ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం మెరుగైన రుసుము నమూనా, పీజీ సీట్ల పెంపుదలపై ఆయన చర్చించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ చిట్టినర్సమ్మ, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసుధీర్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ రాధారాణి, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'తోపుదుర్తి మాట' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: పద్య కవి, అవధాన పృచ్ఛకులు తోపుదుర్తి వెంకట్రామ్ రచించిన 'తోపుదుర్తి మాట' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం మద్దూరు నగర్‌లోని ముద్రికా కళా స్రవంతి కార్యాలయంలో జరిగింది. కళా స్రవంతి అధ్యక్షుడు పి.భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ సామాజిక ప్రయోజనాల కోసం సాహిత్య సృజన చేస్తున్న వెంకట్రామ్ సమాజంలో నిలిచిపోయే రచనలు చేస్తున్నారన్నారు. కవులు, రచయితలు పాల్గొన్నారు.

పాదయాత్ర సభ్యులకు అభినందన

కర్నూలు(సెంట్రల్) : ఇటీవల జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న సభ్యులను పార్టీ జిల్లా కమిటీ అభినందించింది. ఆరు రోజులపాటు జరిగిన పాదయాత్రలో 121 మంది 120 కిలోమీటర్లు పాల్గొన్నారన్నారు. వీరందరికీ సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ షీల్డు అందజేసి అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె. భారతి పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు.


తొలగించిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్యాయంగా తొలగించిన 107 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు టి.రామాంజనేయులు, కృష్ణారెడ్డి, ఆనందు, కృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నగరంలోని స్థానిక మమతానగర్‌కు చెందిన మనోహర్ గౌడ్ (56) అదే కాలనీలో కిరాణకొట్టు నిర్వహిస్తున్నాడు. ఈనెల 17 వ తేదీ పాతబస్టాండ్ వద్ద సరకులు తీసుకుని ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యంలో వెంకటరమణ కాలనీలోని ఏపీ టూరిజం వద్ద మరో వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైసెన్స్ లేకుండా నడిపితే వాహనం సీజ్


ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: లైసెన్స్ లేకుండా నడిపితే వాహనం సీజ్ చేస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. కర్నూలు శివారులోని దూపాడు దగ్గర ఉన్న అశోక్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినులకు ట్రాఫిక్ నియమాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ నాగభూషణం అతిథిగా హాజరై ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా ఎటువంటి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుని ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కోల్పోవలసి వస్తుందని హెచ్చరించారు. కొంతమంది విద్యార్థులు స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి విన్యాసాలకు పాల్పడుతూ ఎదురుగా వచ్చే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బందితో పాటు కాలేజీ బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మైనర్ల వాహనాలు సీజ్

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో కర్నూలులో మైనర్ డ్రైవింగ్‌పై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 15 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు రూ.30,525 జరిమానా విధించారు. మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను ట్రాఫిక్ పీఎస్‌కు రప్పించి డీఎస్పీ నాగభూషణం కౌన్సిలింగ్ నిర్వహించారు.